
andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 37.9, కనిష్ఠం 21.5



నిర్మల్ జిల్లా వార్తలు

ఆదివారం 10 మార్చి 2024

'వంట గ్యాస్ ధరలు తగ్గించడం హర్షణీయం'

నిర్మల్‌కల్చరల్, మార్చి9: ప్రధాని నరేంద్ర మోదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వంట గ్యాస్ ధరలు తగ్గించడం హర్షణీయమని బీజేపీ రాష్ట్ర నాయకుడు రావుల రాంనాథ్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలోని కోట్లాది మంది మహిళలకు ఈ తగ్గింపు ఆర్థిక చేయూతను ఇస్తోందని పేర్కొన్నారు. దేశ ప్రధానిగా మూడోసారి మోదీ గెలిచేందుకు మహిళలు అందరూ మోదీకి సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

ఆదర్శం.. కాల్వ తండా!



- ఊరంతా కూరగాయల సాగు
- సాగు పురుషులది.. మార్కెటింగ్ మహిళా రైతులది
- అంకాపూర్, మెట్‌పల్లి నుంచి కొనుగోలుదారుల బారులు
- జిల్లాలోనే ఆదర్శంగా నిలుస్తున్న కాల్వ తండా గ్రామం



(నిర్మల్ చైన్‌గేట్, మార్చి 9)

ఆ గ్రామాన్ని కూరగాయల ఊరుగా పిలుస్తుంటారు. జిల్లాలోనే అత్యధికంగా ఆకుకూరలు, కూరగాయలు పండించే ఆదర్శ పల్లెగా ఆ ఊరుకు పేరుంది. జిల్లాలోని దిలావర్‌పూర్ మండలం కాల్వ తండా గ్రామానికి చెందిన రైతులంతా ఆకుకూరలు, కూరగాయల పంటలనే 90 శాతం మేర సాగు చేస్తుంటారు. గత 30 ఏళ్ల నుంచి ఈ గ్రామ రైతులు సాంప్రదాయ పంటలైన వరి, మొక్కజొన్న, పసుపు పంటల సాగును పక్కనపెట్టి ఆకుకూరలు, కూరగాయలనే సాగు చేస్తూ ఆదాయం గడిస్తున్నారు. కాల్వ తండా గ్రామంలో దాదాపు 800ల మందికి పైగా జనాభా ఉండగా.. ఇక్కడ 400ల ఎకరాకు పైగా సాగు భూమి ఉంది. బోరు బావులపై ఆధారపడే ఇక్కడి పంటలు సాగవుతుంటాయి. అయితే ఇక్కడి గిరిజన రైతులు మూడు కాలాల పాటు బోరుబావుల ఆధారంగా ఆకుకూరలు, కూరగాయల పంటలను సాగుచేస్తూ వాటిని నిర్మల్ మార్కెట్‌కు తరలిస్తారు. అయితే ఈ గ్రామంలోని మగ రైతులంతా పంటల సాగుపై దృష్టి సారిస్తుండగా.. మహిళలు మాత్రం సాగైన కూరగాయల పంటలను నిర్మల్ మార్కెట్‌కు తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. ప్రతీరోజు వేకువజామునే వీరంతా నిర్మల్ మార్కెట్‌కు చేరుకొని తమ ఆకుకూరలు, కూరగాయలను హోల్ సేల్ వ్యాపారులకు అమ్ముతారు. అలాగే మరికొంత మంది మహిళలు తాము పండించిన కూరగాయలను మార్కెట్‌లోనే రిటైల్‌గా అమ్ముతారు. వేకువజాము నుంచి ఉదయం 11 గంటల వరకు మార్కెట్‌లో కాల్వ తండా మహిళలు కూరగాయల అమ్మకాలతో సందడి చేస్తుంటారు. ఎటు చూసినా

ఆదివారం ప్రత్యేకం SUNDAY SPECIAL

కాల్వ తండా మహిళలే కూరగాయలను అమ్ముతుండడం కనిపిస్తుంది. ముఖ్యంగా కాల్వ తండా రైతులు పాలకూర, మెంతికూరతో పాటు తోటకూర, కొత్తిమీర, ఉల్లికూర సాగు చేస్తారు. దీంతో పాటు వంకాయలకు కాల్వ తండా ఊరు పెట్టింది పేరుగా చెబుతారు. వంకాయలతో పాటు బీరకాయ, కాకర, గోరుచిక్కుడు, టమాట, బెండకాయ లాంటి కూరగాయలను ఎక్కువగా వీరు సాగు చేస్తున్నారు. మార్కెట్‌లో డిమాండ్ పెరిగే అవకాశం ఉన్న కూరగాయల సాగుకు వీరు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుంటారు. డిమాండ్‌కు అనుగుణంగా లాభాలు గడించాలన్న ధ్యేయం. అయితే వీరు కూరగాయలను ఎక్కువగా సేంద్రియ ఎరువులతోనే సాగు చేస్తుండడం విశేషం. తక్కువ మోతాదులో రసాయనిక ఎరువులను వాడడం ఎక్కువగా సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యతనిస్తుండడంతో వీరి కూరగాయలు కొనేందుకు మార్కెట్‌లో కొనుగోలుదారులు ప్రాధాన్యతనిస్తారు. ముఖ్యంగా పెళ్లిళ్ల సీజన్‌లలో చాలా మంది కాల్వ తండా గ్రామానికి వెళ్లి అక్కడే హోల్ సేల్‌గా కూరగాయలను కొనుగోలు చేస్తారు. దీంతో ఈ గ్రామంలో ఎప్పుడూ కొనుగోలుదారులతో సందడి నెలకొంటుంది.

● కూరగాయలు కొనేందుకు ఆసక్తి

జిల్లాలోని నలుమూలల నుంచే కాకుండా పక్క జిల్లాల్లోని ఆదిలాబాద్ జిల్లాతో పాటు అంకాపూర్, మెట్‌పల్లి, కోరుట్ల తదితర ప్రాంతాలకు చెందిన హోల్ సేల్ కూరగాయల వ్యాపారులు నిర్మల్‌కు వచ్చి కాల్వ తండా గ్రామ రైతుల వద్ద కూరగాయలను కొనుగోలు చేస్తుంటారు. కొంతమంది రైతులు తాము పండించిన కూరగాయలను హోల్‌సేల్‌గా వీరికి అమ్ముతుంటారు. అలాగే లోకల్ వ్యాపారులకు సైతం వీరే పెద్ద దిక్కుగా నిలుస్తున్నారు. కాల్వ తండా గ్రామం నుండి నిర్మల్ పట్టణానికి 7 కిలో మీటర్ల దూరం ఉండడంతో వీరంతా ఆటో రిక్షాలు, బైక్‌ల పైనే తాము పండించిన పంటలను తీసుకువస్తారు. రాత్రి 2 గంటల నుండి వీరి కూరగాయల తరలింపు మొదలవుతుంది. ప్రతిరోజు మార్కెట్ రాత్రి రెండు మూడు గంటల నుంచే హోల్‌సేల్ వ్యాపారుల క్రయ విక్రయాలతో రద్దీగా మారుతుంది.

● మార్కెటింగ్‌లో మహిళా రైతులు..

సాగులో మగవారు..

కాల్వ తండా గ్రామానిది కూరగాయల సాగులోనే కాకుండా మార్కెటింగ్‌లో సైతం విభిన్నత కనిపిస్తుంది. ఇక్కడి మగ రైతులు కూరగాయల సాగు కోసం పూర్తి సమయం కేటాయిస్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వీరు పంట చేలల్లో కూరగాయల పంటలకు సేంద్రియ ఎరువులు ఇవ్వడం, తగిన మోతాదులో నీరు అందించడం, అలాగే పంటల మధ్యలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించడం లాంటి పనులు చేస్తారు. చివరకు కూరగాయలను తెంపడం, ఆకుకూరలను తీయడం వంటి పనులు కూడా వీరే చేస్తారు. అయితే సాయంత్రం ఇంటికి తీసుకువచ్చిన ఆకుకూరలు, కూరగాయలను ఇక్కడి మహిళలు శుభ్రం చేసి ఉదయమే నిర్మల్ మార్కెట్‌కు తీసుకువస్తారు.



కూరగాయల కట్టలు కడుతున్న మహిళలు

దీంతో పాటు ఆ పంటలను అమ్మే బాధ్యత కూడా వీరిదే. ఇక్కడి మార్కెట్‌లో కాల్వ తండా మహిళల ఆధిపత్యం కొనసాగుతుంది. పంటల ను అమ్మడంలోను బేరసారాలు చేయడంలో వీరికి ఎవరు సాటి రారని చెబుతుంటారు. నిర్మల్ మార్కెట్‌లో ఇత ర మగ కూరగాయల వ్యాపారులకు కాల్వ తండా మహిళలు గట్టి పోటీ ఇస్తారు. మొత్తమ్మీద కూరగాయల సాగులో కాల్వ తండా ఎందరికో ఆదర్శంగా నిలుస్తోంది.



కూరగాయల సాగు చేస్తున్న కాల్వ తండా రైతులు



ఐకే రెడ్డిని పరామర్శిస్తున్న సుదర్శన్ రెడ్డి

ఐకే రెడ్డిని పరామర్శించిన బోధన్ ఎమ్మెల్యే

నిర్మల్ కల్చరల్, మార్చి 9: మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి సోదరుడు హన్మంత్‌రెడ్డి ఇటీవల మృతి చెందగా శనివారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి నిర్మల్‌లో పరామర్శించారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. ఆయనవెంట సునీల్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ ఈశ్వర్, జడ్పీటీసీ జీవన్‌రెడ్డి, కౌన్సిలర్లు మారుగొండ రాము, ధర్మాజీ రాజేందర్, తదితరులు ఉన్నారు.

కౌన్సిలర్ దంపతులకు పరామర్శ

నిర్మల్ కల్చరల్, మార్చి9: నిర్మల్ పట్టణం మంజులాపూర్ పురపాలక కౌన్సిలర్ దర్శనం నర్సవ్వ, సాయన్న దంపతులను శనివారం బీఆర్ఎస్ నాయకుడు వి.సత్యనారాయణగౌడ్ పరామర్శించారు. ఇటీవల సాయన్న తల్లి అనారోగ్యంతో మృతిచెందడంతో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు ఫణీందర్‌రావు, రమణ గౌడ్, దినేష్ ఉన్నారు.

అన్నిరంగాల్లో మహిళలు ముందంజ

నిర్మల్ అర్బన్, మార్చి9: సమాజపురోగమనంలో మహిళాశక్తి సాటిలేనిదని, అన్నిరంగాల్లో మహిళలు ముందంజలో ఉండడం సమాజానికి శుభసూచకమని ఫ్రెండ్స్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షుడు అన్సర్ పాషా అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని మహిళా వైద్యులు డాక్టర్ సుజనిత, విద్యుల్లత, స్వప్న, ట్యాంక్ బండ్‌పై జీవితం కొనసాగిస్తున్న నిస్సహాయ మహిళ వృద్ధురాలిని సన్మానించారు. మహిళా దినోత్సవం సందర్భంగా ప్రతీ రంగంలో మహిళల ప్రగతి వేగవంతం చేయండి అనే ఇతివృత్తాన్ని ఆధారంగా చేసుకుని వేడుకలు నిర్వహించుకుంటున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు శోభారాణి, ప్రధాన కార్యదర్శి డేవిడ్, సహాయ కార్యదర్శి స్వదేశ్, సలహాదారులు అంజయ్య, మురాద్ అఫ్రోజ్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ మహిళా టీచర్లకు సన్మానం

నిర్మల్ కల్చరల్, మార్చి9: నిర్మల్ పీఆర్టీయూ భవనంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయులను ఈ సందర్భంగా సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలు ఏ.రమాదేవి, జిల్లా అధ్యక్షుడు నరేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి రమణారావు పాల్గొని మహిళా టీచర్లను అభినందించారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం మహోత్సవం



పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు

దిలావర్‌పూర్, మార్చి9: మండలంలోని శ్రీ మాతాన్నపూర్ణ, కదిలి పాపహరేశ్వర స్వామి కల్యాణోత్సవం శుక్రవారం అర్ధరాత్రి వైభవంగా నిర్వహించారు. అంతకుముందు పాపహరేశ్వర స్వామికి లింగోద్భవ పూజలు నిర్వహించారు. స్వామివారి కళ్యాణ మహోత్సవానికి వేలదిగా భక్తులు తులివచ్చారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య స్వామివారు అమ్మవారి మెడలో మంగళసూత్రధారణ చేశారు. అనంతరం ఆది దంపతులను పల్లకీలో ఊరేగించారు. పల్లకీ మోసేందుకు భక్తులు పోటా పడ్డారు. దీంతో చిన్నపాటి తొక్కిసలాట జరిగింది. భక్తులను కట్టడి చేయడానికి పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. హరహర మహాదేవ అంటూభక్తుల శరణు ఘోషతో కదిలి లొద్ది మార్మోగింది. శనివారం ఉదయం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ఛైర్మన్ వెంకట్‌రావు పాటిల్, దేవస్థానం ఈవో రవికిషన్ గౌడ్, దేవస్థానం ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం మున్సిపల్ కార్యాలయం ముట్టడి

- ఖాళీ బిందెలతో ఖానాపూర్ కార్యాలయం ఎదుట బైఠాయించిన డబుల్ బెడ్‌రూమ్ కాలనీవాసులు
- దశలవారీగా సమస్యలను పరిష్కరిస్తామని ఛైర్మన్ రాజుర సత్యం హామీ



ఆందోళనచేస్తున్న కాలనీవాసులతో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

ఖానాపూర్, మార్చి9: తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఖానాపూర్ పట్టణ శివారులోని డబుల్ బెడ్‌రూమ్ కాలనీవాసులు శనివారం మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఖాళీ బిందెలతో కార్యాలయం ఎదుట బైఠాయించారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు ఇక్కడి నుంచి కదిలింది లేదని ఆందోళనకు దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సమస్యను పరిష్కరిస్తామని మున్సిపల్ ఛైర్మన్ రాజుర సత్యం, కమిషనర్ మనోహర్‌లు వచ్చి కాలనీ వాసులను సముదాయించారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్‌రూమ్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నంది రామయ్య మాట్లాడుతూ గత పాలకులు పట్టణ శివారులో ఇళ్లను నిర్మించి ఇచ్చారని, పట్టణం నుంచి 4కిలోమీటర్ల దూరంలో ఉన్న తమకు కనీస సౌకర్యాలు కల్పించకపోవంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో తాగునీటి సమస్యలతో పాటు కాలనీలో కనీసం రోడ్లు, డ్రైనేజీలు, వీధిదీపాలు లేవన్నారు. అంత పెద్ద కాలనీ నిర్మాణం చేసి సెప్టిక్ ట్యాంకులు రెండు మాత్రమే నిర్మించడంతో ఆ ప్రాంతమంతా దుర్గంధంగా మారిందన్నారు. వెంటనే అదనంగా సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం చేపట్టడంతో పాటు మంచినీటి కోసం బోర్లను వేయించాలని కోరారు. సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని మున్సిపల్ ఛైర్మన్ రాజుర సత్యం హామీఇచ్చారు. నీటి ఎద్దడిని పరిష్కరించేందుకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని చెప్పడంతో కాలనీవాసులు ఆందోళన విరమించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ మనోహర్‌కు అందజేశారు. ఈ ఆందోళనలో డబుల్ బెడ్‌రూమ్ అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి గోవింద్ నాయక్, వైస్ ప్రెసిడెంట్ దాదాభాయ్, కాలనీనాయకులు గోరేమియా, సుభాష్‌తోపాటు మహిళలు పాల్గొన్నారు.

కాలభైరవ స్వామి మందిరంలో అన్నదానం

నిర్మల్‌కల్చరల్, మార్చి9: పట్టణంలోని చింతకుంటవాడలో కాలభైరవ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. పూజలో ఛైర్మన్‌ఈశ్వర్, భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, యూత్, తదితరులు పాల్గొన్నారు.

అడెల్లి ఆలయంలో నిజామాబాద్ మేయర్ పూజలు

సారంగాపూర్, మార్చి9: మండలంలో గల అడెల్లి మహాపోచమ్మ ఆలయంలో శనివారం నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ నీతుకిరణ్ పూజలు చేశారు. పూజారి శ్రీనివాస్ అమ్మవారికి హారతినిచ్చారు. అనంతరం ఆలయ సిబ్బంది రమణ ఆమెను సన్మానించారు.

ముథోల్ పశుపతినాథ్ శివాలయంలో ప్రత్యేక పూజలు

- ప్రత్యేక పూజలు చేసిన ముథోల్ ఎమ్మెల్యే
- భారీగా తరలివచ్చిన భక్తజనం
- ఎడ్‌బిడ్ ఆలయంలో శివపార్వతుల కల్యాణం



శివాలయంలో పూజచేస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్



భజనలు చేస్తున్న కళాకారులు

ముథోల్, మార్చి9: మండల కేంద్రంలోని పశుపతినాథ్ శివాలయంలో శనివారం ప్రత్యేక పూజలుచేశారు. ఆలయం వద్ద నిర్వహించిన జాతరలో ప్రజలు పాల్గొన్నారు. ఆలయానికి నిర్మల్ జిల్లా నుండే కాకుండా ఆదిలాబాద్, నిజామాబాద్, మహారాష్ట్ర నుంచి సైతం భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి పశుపతినాథ్‌ని దర్శించుకున్నారు. మహా శివరాత్రిలో భాగంగా ప్రతీ సంవత్సరం రెండు రోజులపాటు జాతర జరుగుతుంది. అలాగే వారంరోజుల నుంచి ఆలయంలో జరుగుతున్న అఖండ హరినామ సప్తాహ కూడా జాతర చివరి రోజే ముగియడంతో కోరిన కోరికలు తీర్చాలని బోలా శంకరుడిని భక్తులు దర్శించుకున్నారు. ఆలయంలో ఉదయమే వేద పండితులచే అభిషేకం, అనంతరం అన్నపూజ చేశారు. కోరిన కోరికలను తీర్చే ఇలవేల్పుగా ఇక్కడ ఇప్రాంత ప్రజలు నమ్మకం. సుమారు 9వేలకు పైగా భక్తులు తరలి వచ్చారు. శివాలయంలోపూజలు చేసేందుకు భక్తులు బారులు తీరారు. ముథోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సప్తాహం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాల విద్యార్థులు భక్తులకు ఇబ్బంది కలుగకుండా సేవలు అందించారు. సప్తాహంలో పాల్గొన్న భజన భక్తులకు, మహారాజ్‌లకు సన్మానించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు అన్నిఏర్పాట్లు చేశారు. అలాగే మండలంలోని ఎడ్‌బిడ్ శివాలయంలో శివరాత్రి సందర్భంగా శుక్రవారం రాత్రి శివపార్వతుల కల్యాణం వేదపండితుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండలంలోని ఎడ్‌బిడ్, చించాల, తరోడా, వెంకటాపూర్ గ్రామాల్లో ఆదివారం ఆలయంలో అన్నపూజచేసి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ముథోల్ సీఐ మల్లేష్ నేతృత్వంలో ఎస్సై సాయికిరణ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలి

- ముథోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్

లోకేశ్వరం, మార్చి 9 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నింటినీ అమలుచేయాలని ముథోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ అన్నారు. శనివారం మండలకేంద్రం లోకేశ్వరంలో ఏర్పాటుచేసిన కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలుచేస్తామని చెప్పి ఇప్పటికీ అమలు చేయకపోవడంపై ఆయన విమర్శించారు. అలాగే నియోజకవర్గంలో అన్ని మండలాలను దశలవారీగా అభివృద్ధి చేస్తానన్నారు. ముఖ్యంగా నీరు, చదువు, వైద్యంపై దృష్టిసారించానని చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు చెక్కులను పంపిణీచేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మోతిరాం, ఎంపీడీవో సల్మాన్ రాజ్, ఆర్ఐ బాలకిషన్, నాయకులు జైసాగర్‌రావు, విలాస్, శ్రీధర్, చిన్నారావు, రత్నాకర్ రావు, పోతన్న, మహేందర్ రెడ్డి, దేవన్న పాల్గొన్నారు.

ముథోల్: ముథోల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ముథోల్ ఎమ్మెల్యే పవర్ రామారావుపటేల్ కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. మండలంలోని 82 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు రాగా సంబంధిత చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ విఠల్, ఆర్ఐ నారాయణ, ఎంపీపీ ఆయేషా అఫ్రోజ్ ఖాన్, బీజేపీ మండల అధ్యక్షులు కోరి పోతన్న, నాయకులు రమేష్, టి. రమేష్, దశరథ్, సురేందర్ రెడ్డి, సప్పటోళ్ల పోతన్న, దేవన్న, రాంచందర్ పాల్గొన్నారు.

రసవత్తరంగా కుస్తీ పోటీలు

కుంటాల, మార్చి9: మహాశివరాత్రి పండగను పురస్కరించుకొని సూర్యపూర్ రాజరాజేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శినవారం నిర్వహించిన కుస్తీపోటీలు రసవత్తరంగా సాగాయి. కుస్తీ పోటీలకు మండలం నలుమూలల నుంచే కాకుండా పక్కరాష్ట్రం నుండి సైతం మల్లయోధులు పాల్గొని పోటీల్లో తలపడ్డారు. పోటీల్లో గెలుపొందిన మొదటి బహుమతి రూ.5 వేలు ద్వితీయ బహుమతిగా రూ.2500లు ఆలయ అభివృద్ధి, వీడీసీ ఆధ్వర్యంలో గెలుపొందినవారికి సన్మానించి బహుమతులను ప్రదానం చేశారు.

శివాలయాలకు పోటెత్తిన భక్తజనం

మండలంలోని ఆయా గ్రామాల్లో గల శివాలయాలు శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం భక్తజనంతో పోటెత్తింది. శుక్రవారం మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని ఉపవాస దీక్షలు చేపట్టిన ప్రజలు అర్ధరాత్రి వరకు ఆలయాల్లో శివపార్వతుల కళ్యాణం తదితర కార్యక్రమాలు చేపట్టి శనివారం ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించి ఉపవాస దీక్షలను విరమింపజేశారు. ఈ సందర్భంగా శనివారం రోజు కూడా మండలకేంద్రం కుంటాల ఉమామహేశ్వర ఆలయం, ఓలా శివాలయం, సూర్యపూర్ రాజరాజేశ్వరస్వామి ఆలయాలు భక్తజనంతో పోటెత్తాయి. ముథోల్‌మాజీ ఎమ్మెల్యే విఠ్టల్‌రెడ్డి సూర్యాపూర్ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



ఆలయ ప్రాంగణంలో కుస్తీపోటీలో తలపడుతున్న మల్లయోధులు

రైల్వే లైన్ సాధన కమిటీ దీక్షలకు మద్దతు

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 9: ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వే లైన్ సాధించేంత వరకు పోరాటాన్ని ఆపమని రైల్వేలైన్ సాధన కమిటీ కన్వీనర్ దేవేందర్ స్పష్టం చేశారు. సాధన కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారంతో 54వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రిమ్స్ కార్మికులు దీక్షలకు మద్దతు తెలిపి దీక్షా శిబిరంలో కూర్చున్నారు. వారు మాట్లాడుతూ రైల్వేలైన్ ఏర్పడితే విద్య, వైద్యం పరంగా జిల్లా ప్రజలకు ఎంతగానో ఉపయోగముంటుందని అన్నారు.



దీక్షలకు మద్దతు తెలుపుతున్న కార్మికులు

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి : సీఐ



మాట్లాడుతున్న సీఐ గండికోట మొగిలి

ఉట్నూర్, మార్చి 9: ఉట్నూర్ పోలీసు సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని, ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని ఉట్నూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గండికోట మొగిలి తెలిపారు. శనివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఎస్సై మనోహర్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. అసత్య సామాజిక మాధ్యమాల ప్రకటనలు చేసే వాటి పట్ల స్పందించవద్దని కోరారు. ఉట్నూర్ పట్టణంలో మైనర్లు సైతం ద్విచక్ర వాహనాలు నడుపుతు ప్రమాదాలకు కారణం అవుతున్నారని తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, ఒకవేళ ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. తాగిన మైకంలో యువత సైతం వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారని, డ్రంక్ అండ్ డ్రైవ్‌కేసులు చేస్తామన్నారు. కొందరు ఆకతాయిలు బైక్ రేసింగ్‌తో పాటు హైస్పీడ్‌గా నడుపుతు ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారని, వారి వల్ల ఇతరులకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. అంతేకాకుండా గంజాయి తాగుతూ, మద్యం తాగుతూ యువత పెడతోవ పడుతున్నారని అన్నారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలకు క్రమశిక్షణ నేర్పించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. ఇటీవల కొందరు అనవసరంగా మద్యానికి, చెడుకు అలవాటు పడి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, గ్రామీణ ప్రాంతాలలో ఫ్రెండ్లీ పోలీసు కార్యక్రమాలు నిర్వహించి త్వరలోనే అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఒక కుటుంబ యజమాని మరణిస్తే ఆ కుటుంబం పూర్తిగా ఇబ్బందుల పాలవుతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ రాగానే అన్ని ప్రాంతాలలోని బెల్ట్‌షాపులను మూసివేస్తామని సీఐ స్పష్టం చేశారు.

ప్రజలను మరోసారి మోసం చేసిన మోదీ

● సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 9: ఈనెల 4న ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటన సందర్భంగా జిల్లా అభివృద్ధిపై ఎలాంటి హామీ ఇవ్వక పోవడం ప్రజలను మరోసారి మోసం చేసినట్టేనని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా ప్రజలు ఎంతో ఆశతో ప్రధాని పర్యటనపై ఉండేనని తెలిపారు. కానీ బహిరంగ సభలో జిల్లా అభివృద్ధిపై ఎలాంటి స్పష్టమైన హామీ ఇవ్వలేద న్నారు. ఎమ్మెల్యే, ఎంపీ ప్రధానికి విన్నవించిన పట్టించుకోలేదని ఆరోపించారు. ఏళ్ల నుంచి ఆదిలాబాద్ ఆర్మూర్ రైల్వేలైన్, ఎయిర్‌పోర్టు, టెక్స్‌టైల్ పార్కు, సీసీఐ పునరుద్ధరణ తదితర అంశాలపై ఊసే లేదన్నారు. మోదీ పర్యటన కేవలం ఎన్నికల ప్రచారం కోసమే జరిగినట్లు తాము భావిస్తున్నామని పేర్కొన్నారు.



గిర్నూర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో ఫణీంధర్ రావు

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

బజార్‌హత్నూర్, మార్చి 9: పంచాయతీ కార్యదర్శులు సమయపాలనను పాటిస్తూ ఎల్లవేళల ప్రజలకు అందుబాటులో ఉండాలని, లేదంటే కఠినచర్యలు తప్పవని డీఎల్‌పీవో ఫణీందర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని పిప్రి, గిర్నూర్, బజార్‌హత్నూర్, జాతర్ల గ్రామలలోని పంచాయతీ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంచాయతీలలో నిర్వహిస్తున్న పలు రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యలయంలోని సమావేశ మందింరంలో మండల కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం ప్రాంభం అయినందున ప్రతీ గ్రామంలో తాగునీటి ఎద్దడిలేకుండా చూడాలని, మిశన్ భగీరథ నీరు అన్ని గ్రామాలలో అందుబాటులో ఉండేవిదంగా చూసుకోవాలన్నారు. నీటిఎద్దడి ఉన్న గ్రామాలను ముందుగానే గుర్తించి వాటికి నివారణచర్యలు లేదా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. ప్రతీఒక్కరు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో అతుల్ కుమార్, మండల కార్యధర్శులు, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ ప్రకటనపై సంబరాలు

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 9: టీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం 21 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ప్రకటించడం పట్ల ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం సంబరాలు జరుపుకున్నారు. స్థానిక ఆర్టీసీ డిపో వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులతో పాటు ఆర్టీసీ ఉద్యోగులు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రుల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఆర్టీసీ సిబ్బంది సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని పలువురు నేతలు పేర్కొన్నారు.

నియామకం పత్రం అందజేత

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 9: ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా నియమితులైన మంచికట్ల ఆశమ్మను పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి సత్కరించారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి సమావేశం ఏర్పాటు చేసి ఆమెకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కందిశ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీకి విధేయంగా పని చేస్తే పదవులు వాటంతట అవే వస్తాయని ఆయన అన్నారు. అధ్యక్ష పదవిని అలంకరించినందుకు ఆమెను అభినందించారు. ఇందులో డీసీసీబీ చైర్మన్ అడ్డిభోజారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకట్‌రెడ్డి, తదితరులున్నారు.

ఘనంగా ధ్యానమందిర వార్షికోత్సవం

తలమడుగు, మార్చి 9: మండలంలోని కుచ్లాపూర్ గ్రామంలో పూలాజీబాబా 28వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరణ ధ్యాన ప్రాముఖ్యతను వివరించారు. ప్రతీ ఒక్కరు ప్రతీరోజు ధ్యానం చేయాలని పలువురు సూచించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి పూలాజీబాబా సంస్థాన్ కుచ్లాపూర్ అధ్యక్షులు రవీందర్ మాట్లాడుతూ అందరు బాబా అడుగుజాడల్లో నడుచుకుంటు బాబా మార్గంలో ప్రయాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పూలాజీబాబా భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



ధ్యానంలో నిమగ్నమైన బాబా భక్తులు

కంకర రోడ్డుతో ఆదివాసీల కష్టాలు

● రోడ్డు తవ్వారు బీటీ మరిచారు పత్తా లేని కాంట్రాక్టర్ ● పట్టించుకోని అధికారులు ● నత్తనడకన నిర్మాణ పనులు



కంకర తేలిన దొర్లి-కప్పర్‌దేవి రోడ్డు



రోడ్డుపై ఇబ్బందికరంగా ప్రయాణం చేస్తున్న వాహనదారుడు

తలమడుగు, మార్చి 9: మారుమూల గిరిజన గ్రామాలను అన్నిరంగాల్లో అభివృద్ధి పరచాలని సంకల్పంతో ప్రభుత్వం కోట్లాది రూపాయల వ్యయంతో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యంతో పనులు నత్తనడకన సాగడంతో మారుమూల గిరిజన గ్రామాలకు అవస్థలు తప్పడం లేదు. వివరాల్లోకి వెళ్తే... మండలంలోని దొర్లి ఎక్స్‌రోడ్డు నుంచి కప్పర్‌దేవి వరకు రోడ్డు నిర్మాణం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.కోట్లను మంజూరు చేసినప్పటికీ రోడ్డు నిర్మాణ పనులను గత ఆరు నెలల క్రితం ప్రారంభించి వదిలేశారు. దీంతో కంకర తేలిన రోడ్డుతో దాదాపు 20 గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. కంకర తేలిన రోడ్డు నుంచి ప్రయాణం చేయాలంటేనే జంకుతున్నారు. అరచేతులు ప్రాణాలు పెట్టుకొని రాకపోకలు సాగిస్తున్నారు. ఈ రోడ్డు కూడా రాత్రిపూట ప్రయాణం చేయాలంటేనే భయంగా ఉందంటున్నారు. త్వరగా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని గిరిజనులు ఉన్నత అధికారులకు విన్నవించిన ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. కంకర తేలిన రోడ్డుతో పశువులకు సైతం ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్డు సక్రమంగా లేక పోవడంతో ఆర్టీసీ బస్సు సైతం రావడం లేదన్నారు. గతంలో రెండు బస్సులు వచ్చేటివి ఇప్పుడు ఒకే ఒక బస్సు వస్తుందని మహిళలకు ప్రభుత్వం కల్పించిన ఉచిత బస్సు కూడా సక్రమంగా రావడం లేదన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి దొర్లి నుంచి కప్పర్‌దేవి వరకు నత్తనడకన సాగుతున్న రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని స్థానిక ఆదివాసీ గిరిజనులు కోరుతున్నారు.

కత్తిపోట్లతో యువకుడి హత్య

● ఒకే వర్గానికి చెందిన ఇద్దరు యువకుల మధ్య ఘర్షణ
● నిర్మల్ జిల్లా భైంసాలో ఘటన

భైంసా, మార్చి 9: నిర్మల్ జిల్లా భైంసా పట్టణ కేంద్రంలోని ఓవైసీ నగర్‌లో శనివారం రాత్రి ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఓవైసీనగర్ కాలనీకు చెందిన సయ్యద్ సోహేల్(25), నయాబాది కాలనీకు చెందిన అదేవర్గానికి చెందిన మరో యువకునికి మధ్య నెలకొన్న వ్యక్తిగత కక్షలతో హత్యోదంతం జరిగినట్లుగా తెలిసింది. శుక్రవారం ఇద్దరు యువకుల మధ్య ఘర్షణ జరుగగా మిత్రులు సర్దిచెప్పి ఇద్దరి మధ్య రాజీ కుదుర్చినట్లుగా సమాచారం. అయినా ఇద్దరి మధ్య పగ, ప్రతీకారాలు సమసిపోలేదని తెలిసింది. ఇందులో భాగంగానే శనివారం రాత్రి ఇంట్లో ఉన్న సయ్యద్ సోహేల్‌పై పగతో రగిలిపోతున్న సదరు యువకుడు ఫోన్ చేసి మాట్లాడుకునేందుకు రమ్మని పిలిచినట్లుగా సమాచారం. దీంతో ఇంటి నుంచి వెళ్లిన సయ్యద్ సోహేల్‌కు మార్గమధ్యలోని సాయినగర్ కాలనీ సమీపంలో సదరు యువకుడు దారికాచి కత్తితో దాడి తెగబడ్డాడు. విచక్షణరహితంగా కత్తితో పొడవడంతో సయ్యద్ సోహేల్ ఘటనాస్థలిలోనే కిందపడి అపస్మారక స్థితికి వెళ్లాడు. ఘటనలో మరో ఇద్దరు యువకులు సైతం పాల్గొన్నట్లుగా తెలిసింది. దాడికి తెగపడ్డవారు అక్కడి నుంచి పారిపోయారు. అపస్మారకస్థితిలోనున్న యువకుడిని స్థానికులు ఇక్కడి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రాణపాయ స్థితిలోనున్న సదరు యువకుడికి స్థానికంగా ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్య సేవల కోసం నిజామాబాద్ ఆసుపత్రికి తరలిస్తుండగా భైంసా సరిహద్దు ప్రాంతంలోనే మృతిచెందాడు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇక్కడి ఏరియా ఆసుపత్రికి తరలించారు. భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఘటనాస్థలిలో విచారణ చేపట్టారు. మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు సేకరించారు. హత్యోదంత ఘటన నేపథ్యంలో పట్టణ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు గాను పట్టణ సీఐ రాజారెడ్డి నేతృత్వంలో పోలీసులు భారీ బందోబస్తు చర్యలు చేపట్టారు.



ఘటనా స్థలంలో విచారణ జరుపుతున్న ఏఏస్పీ కాంతిలాల్ పాటిల్ (ఇన్‌సెట్‌లో సోహేల్ మృతదేహం)

‘ఐటీ కారిడార్ అభివృద్ధికి పూర్తి సహకారం’

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 9: ఆదిలాబాద్‌లో ఐటీ కారిడార్ అభివృద్ధి చెందాలని, దానికి తనవంతు పూర్తి సహకారం ఉంటుందని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. బీడీఎన్‌టీ, ఎన్‌టీటీ డాటా, యూపీడీహెచ్ఐ ఐటీ సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఐటీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వితీయ వార్షికోత్సవాన్ని పట్టణంలో నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ జోగుప్రేమేందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదిలాబాద్ లాంటి మారుమూల ప్రాంతంలో ఐటీ సెక్టార్, ఐటీ కారిడార్ అభివృద్ధి చెందాల్సిన అవసరముందన్నారు. దీనికి సంబంధంచి భవిష్యత్తులో తనవంతు సహకారం ఈ సంస్థలకు ఉంటుందన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల శంకర్



యజ్ఞంలో పాల్గొన్న గ్రామస్తులు

ముగిసిన వడ్డాడి జాతర

● చట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన వేలాది భక్తజనం

తాంసి, మార్చి 9: మండలంలోని వడ్డాడి గ్రామంలో గత ఐదు రోజుల నుంచి నిర్వహించిన జాతర శనివారం ముగిసింది. ఉదయం ఎనిమిది గంటలకు 51 మంది జంటలతో 11 మంది వేద పండితుల ద్వారా మహా యజ్ఞం నిర్వహించారు. అనంతరం శివపార్వతులకు కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని అన్నదానం చేశారు. శివపార్వతుల కళ్యాణాన్ని తిలకించేందుకుకోసం జిల్లా నలుమూలల నుంచే కాకుండా పక్కన ఉన్న మహారాష్ట్ర నుంచి సైతం వేలాది మంది భక్తులు హాజరయ్యారు. సాయంత్రం ప్రాంతంలో రథోత్సవాన్ని నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తుల మధ్య ఈ కార్యక్రమం ముగిసింది. జాతరలో వెలిసిన దుకాణాల వద్ద వస్తువులు కొనేందుకు కోసం జనం బారులు తీరారు. నరసింహస్వామికి మొక్కులు చెల్లించుకున్నారు.

● ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే

వడ్డాడి నరసింహస్వామి జాతరలో భాగంగా శనివారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. తీర్థప్రసాదాలు తీసుకున్న తర్వాత ఆయనను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ప్రతి ఒక్కరు భక్తిమార్గంలో నడిచినప్పుడే మనసుకు శాంతి కలుగుతుందని తెలిపారు. ప్రతీఒక్కరు భక్తి మార్గం ముందుడుగు వేయాలని కోరారు.



ఆలయం ముందు దర్శనం కోసం క్యూకట్టిన భక్తులు

భక్తులతో పోటెత్తిన పెండల్‌శాడ ఆత్మలింగ హన్మాన్ ఆలయం

జైనథ్, మార్చి 9: మండలంలోని పెండల్‌వాడ గ్రామంలో ప్రతి సంవత్సరం మాదిరిగానే నెల రోజుల ముందే మహాశివరాత్రి వేడుకలను అంగరంగ వైభవంగా జరుపుకుంటారు. ఇందులో పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్రతో పాటు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని ఆయా గ్రామాల గిరిజనులు,ఆదివాసీలు వివిధ వాహనాల్లో వచ్చి ఆదివాసీ నృత్యాలతో పెండల్‌వాడ ఆత్మలింగ హనుమంతుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మహాశివరాత్రి పర్వదినం ముగింపు రోజు అయిన శనివారం పొరుగు రాష్ట్రమైన వహారాష్ట్రతో పాటు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా నుంచి మహిళలు, భక్తులు ప్రజలు గిరిజనులు పెద్దఎత్తున హాజరు కావడంతో పెండల్‌వాడ ఆత్మలింగ హన్మాన్ ఆలయం భక్తులతో పోటెత్తింది. దర్శనం కోసం గంటల పాటు క్యూ కట్టారు. పెండల్‌వాడ నది తీరంలో శివాలయంలో ప్రత్యేక పూజలు, శివదీక్ష విరమణ, మహిళలు బోనాలు వండి సాత్నాల నదికి నైవేద్యాలు సమర్పించి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరలో వివిధ వస్తువులను కొనుగోలు చేసి చిన్నారులు ఊయలలు కోలాటాలు ఆడారు.

‘ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటాం’

బజార్‌హత్నూర్, మార్చి 9: ప్రతీ కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని ఏఐసీసీ రాష్ట్ర విచార్ విభాగ్ కోఆర్డినేటర్ తుల అరుణ్ కుమార్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని స్థానిక తిరుమల గార్డెన్‌లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి పార్టీ కండువకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అవలింబిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్శితులై, పార్టీ మీద ఉన్న నమ్మకంతోనే ఈ రోజు పెద్దమొత్తంలో బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి చేరారని అన్నారు. ప్రతీ కార్యకర్తకు పార్టీ అండగా నిలబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య, మండల అద్యక్షుడు జల్కె పాండురంగ్, తదితరులు పాల్గొన్నారు.

3.4 కిలోల గంజాయి పట్టివేత

మావల, మార్చి 9: అక్రమంగా 3.4 కిలోల గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం మావల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన నిందితుల వివరాలను వెల్లడించారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా పోలీసులు జిల్లా నలుమూలలతో పాటు జిల్లాకేంద్రంలోనూ విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే గంజాయిని పట్టుకోవడం జరిగిందన్నారు. శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక రామ్‌నగర్ అగ్రికల్చర్ కళాశాల పరిసర ప్రాంతం వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కొందరు అనుమానంగా తిరుగుతూ పోలీసులకు కంట పడ్డారు. దీంతో వారు పారిపోతుండగా నిందితులను పట్టుకున్నామని తెలిపారు. వారిలో ఇచ్చోడలోని మహాత్మా జ్యోతి బాపూలే స్కూల్ స్కావెంజర్‌లుగా పని చేస్తున్న ఏ1 బనియ శాంతాబాయిగా గుర్తించామని, ఆమె బోథ్ మండలంలోని సోనాల సమీపంలో గల గుర్రాల తండా గ్రామమని, కాగా ప్రస్తుతం ఆదిలాబాద్‌లోని రామ్‌నగర్‌లో నివాసం ఉంటునట్లు పేర్కొన్నారు. అదే విధంగా సంజయ్ కూడా అదే పాఠశాలలో స్కావెంజర్‌గా పని చేస్తుండగా.. ప్రస్తుతం ఆదిలాబాద్‌లో నివాసముంటున్నట్లు తెలిపారు. వీరు డబ్బు మీద అత్యాశ, పరిస్థితుల ప్రభావం వల్ల గంజాయిని కొనుగోలు చేసి మహారాష్ట్రలో అమ్మి డబ్బులు సంపాదించాలని ఈ వ్యవహారాన్ని నడుపుతున్నట్లు తెలిపారు. నిందితురాలు శాంతాబాయి తన తమ్ముడు నార్నూర్ మండలం చోర్గావ్ గ్రామానికి సంబంధించిన కేవల్‌సింగ్ వద్ద గంజాయిని పండించి మహారాష్ట్రకు తరలించే క్రమంలో పట్టుబడ్డట్లు తెలిపింది. అయితే, వారి వద్ద నుంచి 3.4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎసీ వెల్లడించారు. కాగా, గంజాయిని అంతర్ పంటగా పండించిన కేవల్‌సింగ్‌పై ఇదివరకే ఫిబ్రవరి 10న నార్నూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదై ప్రస్తుతం జైలులో ఉన్నాడాని, గంజాయి అక్రమంగా పండించిన, గంజాయి, మాదకద్రవ్యాలను రవాణా లాంటి చట్ట విరుద్ధమైన కార్యక్రమాల్లో పాల్గొనడం నేరమని వారిపై కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. ఎటువంటి సమాచారం అయినా జిల్లా ఉన్నతాధికారులకు కాని, డయల్ 100 ద్వారా కాని సమాచారాన్ని అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచబడుతాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీసీఎస్ సీఐ చంద్రశేఖర్, రూరల్ సీఐ ఫణీంధర్, ఎస్సై విష్ణువర్ధన్, సీసీఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వైన్స్‌షాపు దొంగల అరెస్టు!!

తాంసి, మార్చి 9: మండల కేంద్రంలో ఉన్న వైన్స్‌షాపులో గత నాలుగు రోజుల క్రితం దొంగతనం జరిగింది. మద్యాన్ని దొంగలిస్తున్న తరుణంలోనే వీరిని సంబంధిత వైన్స్‌షాపు సిబ్బంది పట్టుకున్నారు. వెంటనే వీరిని తాంసి పోలీసులకు అప్పజెప్పినప్పటికీ పోలీసులు శనివారం వారిని విలేకరుల ముందు హాజరు పరిచారు. దొంగతనానికి పాల్పడ్డ ముగ్గురిని రిమాండ్‌కు పంపుతున్నట్లు ఆదిలాబాద్ రూరల్ సీఐ పేర్కొన్నారు. దొంగతనం జరిగిన రోజునే పోలీసులకు నిందితులను అప్పగించినప్పటికీ ఎందుకు రిమాండ్‌కు పంపలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. మొత్తమీద తాంసి పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఉన్న వైన్స్‌షాపులో దొంగతనం జరగడం చర్చనీయాంశంగా మారింది. ఇది ఇలా ఉంటే పట్టుకొని మూడు రోజులు దాటిరా వారిని గోప్యంగా ఉంచడం పట్ల పలువురు పలు విధాలుగా చర్చించుకుంటున్నారు.

అన్నతో గొడవ పడ్డారనే బైకులకు నిప్పు

● రాచాపూర్‌లో నెల వ్యవధిలో నాలుగు బైకుల కాల్చివేత
● వివరాలువెల్లడించిన ఎస్సై సల్లా శ్రీకాంత్

లక్ష్మణచాంద, మార్చి 9: అన్నతో గొడవ పడ్డారని కక్ష పెంచుకొని బైకులు తగలపెట్టిన నిందితుడి కథ శనివారం బట్టబయలైంది. లక్ష్మణచాంద మండలంలోని రాచాపూర్ గ్రామంలో వరుసగా బైకులు తగలబడుతున్న విషయం అందరికీ తెలిసిందే. ఈ విషయంలో గ్రామస్తులు ఆందోళన చెందుతున్న విషయాన్ని తెలుసుకున్న ఎస్సై సల్లా శ్రీకాంత్ తన పోలీసు సిబ్బందితో చాకచక్యంగా వ్యవహరించి ఎట్టకేలకు నిందితుడిని పట్టుకుని శనివారం రిమాండ్ చేశారు. ఆయన వివరాల ప్రకారం.. రాచాపూర్ గ్రామస్థులకు తన అన్నకు మధ్య జరిగిన పాత గొడవలు మనసులో పెట్టుకొని గ్రామంలో నలుగురు వ్యక్తులకు సంబంధించిన నాలుగు బైకులను అదే గ్రామానికి చెందిన భూషి సాయికుమార్ అనే వ్యక్తి తగులబెట్టే పథకం వేశాడు. గత నెల వ్యవధిలో తన అన్నతో గొడవ పడ్డ వ్యక్తుల బైకులను తగలపెడితేనే తన కక్ష తీరుతుందని భావించి.. అర్ధరాత్రి అదే గ్రామానికి చెందిన దాసరి అశోక్ బైకును పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఆ తర్వాత వారం వ్యవధిలో స్థానిక నవీన్‌గౌడ్, రాందేని మహేష్‌ల బైకులకు నిప్పంటించి దహనం చేశాడు. ఇదే క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి అదే గ్రామానికి చెందిన ఈర్ల ముత్యం బైకుకి నిందితుడు నిప్పంటించి పారిపోతుండగా సీసీ కెమెరాలో టీవీ కెమెరాలో, గ్రామంలో ఇంకో వ్యక్తి ఇంటి వద్ద కెమెరాలో రికార్డు అవ్వగా నిందితుడిని పోలీసులు గుర్తించినట్లు ఆయన వివరించారు. వెంటనే సోన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో లక్ష్మణచాంద పోలీసులు నిందితుడిని పట్టుకొని విచారించగా నిందితుడు చేసిన నేరాలు బయటపడ్డాయి. నిందితుడి దగ్గర నుంచి పెట్రోల్ తీసుకెళ్లడానికి ఉపయోగించిన బాటిల్, నిందితుడు నేరం చేసిన సమయంలో ధరించిన దుస్తువులు, అగ్గిపెట్టే స్వాధీనం చేసుకొని, నిందితుడిని అరెస్టు చేసి గౌరవ న్యాయస్థానంలో హాజరుపరచగా నిందితుడికి 10 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో కృషి చేసిన సీఐ నవీన్ కుమార్, లక్ష్మణచాంద ఎస్సై సల్లా శ్రీకాంత్, కానిస్టేబుల్ కిరణ్, భీమేష్, సాయి, సునీల్‌లను ఎస్పీ జానకి షర్మిల, నిర్మల్ సబ్ డివిజన్ పోలీస్ ఆఫీసర్ గంగారెడ్డి అభినందించారు.

అర్బన్ పార్కులో అగ్ని ప్రమాదం

బోథ్, మార్చి 9: బోథ్ రేంజి పరిధిలోని 44వ నెంబర్ జాతీయ రహదారి పక్కన ఉన్న అర్బన్ పార్కులో శనివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో పార్కులోని చిన్న చిన్న మొక్కలతో పాటు గడ్డి కాలిబూడిదయ్యింది. విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు.



కాలిపోతున్న పార్కులోని చెట్లు

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 37.0, కనిష్ఠం 16.2



ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
ఆదివారం 10 మార్చి 2024



● ఇచ్చోడ మండలం దుబర్‌పేట్ గ్రామ సమీపంలోని అక్రమ వెంచర్



● తలమడుగు మండలం కజ్జర్ల, దేవాపూర్ గ్రామాల్లో అక్రమంగా ఏర్పాటు చేసిన లేఅవుట్లు

రెచ్చిపోతున్న.. రియల్ మాఫియా

- జిల్లాలో అక్రమదందాకు ఎగబడుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు
- పల్లె ప్రాంతాల్లో విచ్చలవిడిగా అక్రమ వెంచర్ల ఏర్పాటు
- అసైన్డ్ భూములపై రియల్ నేతల కన్ను
- ఖాళీ జాగా కనిపిస్తే చాలు.. అక్రమార్కుల పాగా
- అనుమతులు లేకున్నా.. అడ్డగోలుగా వ్యాపారం
- అమాయక రైతుల అవసరాలే ఆసరాగా పంట భూములను ప్లాట్లుగా మార్చేస్తున్న వైనం
- తేలికగానే తీసుకుంటున్న పంచాయతీల ప్రత్యేకాధికారులు
- జిల్లావ్యాప్తంగా 25 వెంచర్లకు మాత్రమే అనుమతులు ఉండగా.. అనధికారికంగా వందలాది వెంచర్లు



ఆదిలాబాద్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పల్లె, పట్టణం అనే తేడా లేకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులు అడ్డగోలుగా అక్రమ దందాకు ఎగబడుతున్నారు. వారి ఆగడాలకు అడ్డు అదుపే లేకుండా పోతుంది. ఏజెన్సీ, నాన్ ఏజెన్సీ అనే తేడా లేకుండానే పోయింది. ఖాళీ జాగా కనిపిస్తే చాలు అక్రమంగా లే ఔట్లను ఏర్పాటు చేస్తూ అమ్మేసుకుంటున్నారు. ముఖ్యంగా నేరడిగొండ, ఇచ్చోడ, గుడిహత్నూర్, మావల, తలమడుగు, ఇంద్రవెల్లి, ఉట్నూర్ మండలాల పరిసర ప్రాంతాలలో అక్రమ వెంచర్లను విచ్చలవిడిగా ఏర్పాటు చేస్తున్నారు. గతంలో పని చేసిన జిల్లా కలెక్టర్లు అక్రమ వెంచర్లపై ఉక్కుపాదం మోపిన ఆ తర్వాత అటు వైపు అధికారులు కన్నెత్తయినా చూడడం లేదు. అమాయక రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని పంట భూములను ప్లాట్లుగా మార్చేస్తున్నారు. దీంతో మండల కేంద్రాల చుట్టు ఉన్న వ్యవసాయ భూముల ధరలకు రెక్కలు వస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతంలో కేవలం 25వెంచర్లకు మాత్రమే అనుమతులు ఉన్నట్లు తెలుస్తుంది. మిగితా వందలాది వెంచర్లు అనాధికారికంగానే కొనసాగుతున్నాయి. జిల్లాలో ఏజెన్సీ మండలాలైనా ఇచ్చోడ, ఇంద్రవెల్లి, బేల, మండలాల్లో యదేచ్చగా అక్రమ వెంచర్ల దందా కొనసాగుతోంది. పెట్టిన పెట్టుబడులకు పదింతల లాభాలు రాబట్టేందుకు రియలిస్టేట్ వ్యాపారులు తెలివిగా హద్దు రాళ్లను ఏర్పాటు చేయకుండా గుంటలతోనే రిజిస్ట్రేషన్ చేస్తూ అమ్మేస్తున్నారు. ఇదంతా అక్రమమే అయినప్పటికి మండల తహసీల్దార్లకు అడిగినంత ఇవ్వడంతో అంతా సక్రమంగానే చేసేస్తున్నారు. అంతేకాకుండా కొందరు ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలు, ఉద్యోగులు ఇదే పనిగా మార్చుకుని లేఔట్లను ఏర్పాటు చేస్తూ అమ్మేసుకుంటున్నారు. అనుమతులు అడిగే వారన్న ధీమాతో రెచ్చిపోతున్నారు.

అధికారుల కనుసన్నల్లోనే..

జిల్లాలో జరుగుతున్న అక్రమ వెంచర్ల దందా అంతా అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోందన్న ఆరోపణలు వస్తున్నాయి. ఏదో రాత్రి వేళల్లో గుట్టు చప్పుడుకాకుండా అక్రమ దందాలకు పాల్పడుతున్నారంటే పొరపాటే. పట్టపగలే ఎకరాల కొద్ది వెంచర్లను ఏర్పాటు చేస్తూ అమ్మేసుకుంటున్న అధికారులు చోద్యం చూడడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదంతా అధికారులకు తెలిసిన తెలియనట్లుగానే వ్యవహరించడంపై ఆరోపణలు వస్తున్నాయి. ఏదో ఫిర్యాదు వచ్చినప్పుడే హడావిడి చేయడం ఆ తర్వాత అంతా మాములుగానే మారి పోతుంది. స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించి అక్రమ వెంచర్లను తొలగించాల్సిన అధికారులే రియల్ వ్యాపారులతో చేతులు కలిపి అక్రమ దందాలకు తెరలేపుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఆర్థిక పరపతి, రాజకీయ నేతల ఒత్తిళ్లతో కొంతమంది అధికారులు వెంచర్ల జోలికి వెళ్లడం లేదంటున్నారు. అసలు ఏజెన్సీ ప్రాంతంలో ఎలాంటి వెంచర్లు, పెద్ద భవనాల నిర్మాణానికి ఎలాంటి అనుమతులు ఉండవు. కానీ అక్రమంగా వెంచర్లను ఏర్పాటు చేస్తూ అమ్మేసుకుంటున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో భూక్రయవిక్రయాలు జరపాలంటే గిరిజనుల అనుమతితోనే చేపట్టాల్సి ఉంటుంది. అలాగే ఏజెన్సీలో ఎలాంటి వెంచర్లకు అనుమతులు కూడా ఇవ్వడానికి వీలు లేదు. కానీ జిల్లాలో దానికి విరుద్ధంగా జరుగుతోంది. అడ్డగోలుగా వెంచర్లు వేస్తూ అమ్మేస్తున్న అడ్డుకునే నాథుడే కనిపించడం లేదు. గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని బినామీ పేర్లతో గిరిజనేతరులు పెత్తనం చెలాయిస్తున్నారు. ఆర్థిక, రాజకీయ, పలుకుబడితో అడ్డగోలు వ్యాపారానికి ఎగబడుతున్నారు. అయిన అడ్డుకునే వారే కనిపించడం లేదు.

కనుమరుగవుతున్న సాగు భూములు

రియల్ ఎస్టేట్ వ్యాపారుల కన్నుపడి గ్రామాల్లో వ్యవసాయ భూములు కనిపించకుండానే పోతున్నాయి. కొంత మంది అమాయక రైతుల ఆర్థిక అవసరాలను అడ్డు పెట్టుకుని రియల్ దందాకు ఎగబడుతున్నారు. ఏజెన్సీ, నాన్ ఏజెన్సీ ప్రాంతాలలో అసైన్డ్ భూములు కూడా వెంచర్లుగానే మారుతున్నాయి. గిరిజన గ్రామాల్లో చక్రం తిప్పుతున్న కొందరు గిరిజనేతర పెద్దలు రియల్ మాఫియాతో చేతులు కలుపుతూ ప్లాట్లను అమ్మేసుకుంటున్నారు. ఏటా వందల ఎకరాల భూములు ప్లాట్లుగా మారిపోతున్నాయి. దీంతో సాగు చేసుకునేందుకు పంట భూములు కరువవడంతో రైతులు ఉపాధి కోసం పట్టణాలకు పరుగులు తీస్తున్నారు. గ్రామాల్లో కొంత పలుకుబడిని కలిగి ఉండి తెలివి తేటలు ఉన్న వారంతా ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారం వైపే మొగ్గుచూపుతున్నారు. ఎందుకంటే తక్కువ సమయంలోనే ఎక్కువగా సంపాదించే అవకాశం ఉండడంతో దేనికైనా తెగిస్తున్నారు. వివాదాస్పద భూములను సెటిల్‌మెంట్ చేస్తూ విలువైన భూములను తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. ఇలాంటి భూముల్లో వెంచర్లను ఏర్పాటు చేసి పదింతల లాభాలను జేబులో వేసుకుంటున్నారు. వాతావరణ పరిస్థితులతో పంటల సాగు ఓ సవాలుగా మారడంతో రైతులు కూడా పంట భూములను విక్రయిస్తూ ఇతర వ్యాపారాల వైపు ఆసక్తి చూపుతున్నారు. అదేవిధంగా దీంతో జిల్లాలో ఏటా వ్యవసాయ భూముల విస్తీర్ణం గణనీయంగా పడిపోతోందని తెలుస్తుంది. స్థానికంగా మండల నేతలు, అధికారుల సహకారంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు అడ్డగోలు దందాలకు ఎగబడుతూ అందినకాడికి దండుకుంటున్నారు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు అక్రమ వెంచర్లపై దృష్టి సారిస్తే ప్రభుత్వానికి భారీ ఆదాయం సమకూరనుంది.



పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు లేవు
: వినోద్‌కుమార్, ఎంపీవో, తలమడుగు

మండలంలోని దేవాపూర్ కజ్జర్ల గ్రామంలో అక్రమంగా ఏర్పాటు చేసిన వెంచర్లకు ఎలాంటి అనుమతులు లేవు. ఇప్పటికే అక్రమ వెంచర్లను గుర్తించి నోటీసులు ఇవ్వడం జరిగింది. ఎవరైనా అనుమతి లేకుండా వెంచర్లు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

సంక్షిప్త సమాచారం

నేడు గురుకులం స్క్రీనింగ్ టెస్టు

ఉట్నూర్, మార్చి 9: గురుకులం సెంటర్ ఫర్ ఎక్సెన్స్ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశం కోసం ఫైనల్ స్క్రీనింగ్ టెస్టు ఆదివారం ఉట్నూర్ లాల్‌టెకిడి తెలంగాణ గురుకకుల జూనియర్ కళాశాలలో నిర్వహించడం జరుగుతుందని, కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేశామని గురుకుల కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్ తెలిపారు. ఎంపీసీలో 218 మంది, బైపీసీలో 237 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని అన్నారు. స్క్రీనింగ్ టెస్టు ఒకటిలో అర్హత సాధించిన వారు తమ హాల్‌టికెట్ అడ్రస్ ప్రూఫ్‌లతో ఏదైనా ఒకటి తీసుకొని పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. పరీక్ష ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని, విద్యార్థులు గంట ముందే పరీక్షకు హాజరు కావాలన్నారు.

'సభను జయప్రదం చేయాలి'

నేరడగొండ, మార్చి 9: ఈనెల 12న సికింద్రాబాద్‌లోని ఇంపీరియల్ గార్డెన్‌లో జరగబోయే బీజేపీ సమ్మేళన సభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేస్తున్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సమక్షంలో జరిగే ఈ సభను విజయవంతం చేయాలని శనివారం మండల కేంద్రంలోని బీజేపీ మండల కార్యాలయంలో మండల పోలింగ్ బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ మాట్లాడుతూ మార్చి12న జరగబోయే కార్యక్రమానికి జిల్లాలోని ప్రతీ బూత్ కమిటీ అధ్యక్షుడు హాజరై విజయవంతం చేయాలని తెలిపారు. ఇందులో మండల అధ్యక్షుడు హీరాసింగ్, ప్రధాన కార్యదర్శులు సాబ్లె సంతోష్‌సింగ్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

'13న నిర్మల్‌లో పార్లమెంట్ నియోజక వర్గ సమావేశం'

ఉట్నూర్, మార్చి 9: ఈనెల 13న ఎమ్మార్పీఎస్ ప్రతినిధులతో ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజక వర్గం సమావేశం నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నామని సంఘం జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ మాదిగ అన్నారు. అందులో భాగంగా ఉట్నూర్ మాదిగ సంఘ భవనంలో శనివారం ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మాదిగ లాయర్ల జిల్లా బాధ్యులు నాతరిరాజు మాదిగ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్త సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్ పార్లమెంటరీ నియోజక వర్గ పరిధిలోని ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమీక్ష సమావేశం 13న నిర్మల్‌లో ఉంటుందని, ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నారన్నారు. ఈ సమావేశంలో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఎస్సీ వర్గీకరణ అంశాన్ని దృష్టిలో అనుసరించాల్సిన ప్రణాళిక సిద్ధం చేసుకుని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయనున్నారని అన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఇందులో ఎమ్మార్పీఎస్ మండల బాధ్యుడు గొడిసెల మహేశ్‌మాదిగ, దొనకొండ ప్రశాంత్, బెరిగెడి సురేష్, మేకల కిరణ్, మహేందర్, ఆశన్న, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆరెల్లి మల్లేష్ మాదిగ

శివాలయాల్లో జోరుగా అన్నదానాలు

● ఉపవాస దీక్షలను విరమించిన భక్తులు ● సాలెవాడలో శివపార్వతుల పల్లకీ ఊరేగింపు ● జిల్లావ్యాప్తంగా ముగిసిన శివరాత్రి ఉత్సవాలు

తలమడుగు, మార్చి 9: జిల్లాలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆయా గ్రామాల్లో గల శివాలయాల్లో ఘనంగా శివరాత్రి మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గత రెండు రోజులుగా భక్తులతో శివాలయాలు కిటకిటలాడాయి. దీనిలో భాగంగా మండలంలోని ఝరి, చర్లపల్లి, బరంపూర్, తలమడుగు, కజ్జర్ల, తదితర గ్రామంలోని శివాలయాలు నిర్వహించిన శివరాత్రి మహోత్సవాల్లో జోరుగా అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. అదేవిధంగా శుక్రవారం జాగరణ చేపట్టి శనివారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాలలో ఉపవాస దీక్షలను భక్తులు విరమించారు. మండలంలోని అతి పురాతనమైన రాజారాజేశ్వర ఆలయంలో వేలాది మంది భక్తులు తరలివచ్చారు. అదే విధంగా జాతర సందర్భంగా కబడ్డీ వాలీబాల్ పోటీలను ఏర్పాటు చేయడంతో క్రీడల పోటీల్లో పాల్గొన్నేందుకు తెలంగాణ కాకుండా మహారాష్ట్ర నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు. అదేవిదంగా తలమడుగు మండలకేంద్రంలో నిర్వహించిన అన్నదానంలో గ్రామస్థులు, భక్తులు చేపట్టిన అన్నదానంలో భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.

● ఘనంగా శివపార్వతుల పల్లకీ ఊరేగింపు

ఉట్నూర్: మహాశివ రాత్రి పర్వదినం పురస్కరించుకుని నిర్వహించిన శివ పార్వతుల కళ్యాణం అనంతరం శివపార్వతుల పల్లకీ ఊరేగింపు కార్యక్రమాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉట్నూర్ మండలంలోని సాలెవాడ శివాలయంలో నారాయణ మహరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి జాగారణ సందర్భంగా పారాయణం నిర్వహించారు. శనివారం ఉదయం మహాదేవ ఆలయ భక్త మండలి ఆధ్వర్యంలో సాలెవాడ గ్రామంలో పల్లకీ ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాదేవ్ బాలల ఆశ్రయంలో చదువుకుంటున్న చిన్నారులు పల్లకీ ముందు భజనలు చేస్తూ నృత్యాలు చేశారు. ఉట్నూర్ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, అలే కమిటీ అధ్యక్షుడు సల్‌గారే రవీందర్, సింగారే భారత్, రాంచందర్, నందకుమార్‌లు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా పాత ఉట్నూర్ శివాలయంకు చెందిన శివపార్వతుల విగ్రహాల శోభాయాత్రను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూజారి సంతోష్‌దుబే పెద్దఎత్తున నిర్వహించారు.

● ఆలయాల్లో కొనసాగిన భక్తుల తాకిడి

ఆదిలాబాద్ అర్బన్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లాలోని ఆలయాల్లో సందడి కొనసాగుతుంది. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని పలు శైవక్షేత్రాలకు భారీసంఖ్యలో భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పరమశివున్ని దర్శించుకుని ఉపవాస దీక్షలు విరమించారు. అనంతరం ఆలయాల్లో ఏర్పాటు చేసిన మహా ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీలు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

● బాది నందీశ్వరున్ని దర్శించుకున్న రామన్న

జైనథ్: మహాశివరాత్రి పర్వదిన వేడుకలను పురస్కరించుకుని రాష్ట్ర మాజీ మంత్రి జోగు రామన్న శనివారం బేల మండలంలోని బాది గ్రామంలో గల నందీశ్వర ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నందీశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలు పాడి పంటలతో చల్లంగా ఉండాలని వేడుకున్నారు. ఇందులో బేల ఎంపీపీ వనతి గంభీర్‌ఠాక్రె, ఆడనేశ్వర్ ఫౌండేషన్‌చైర్మన్ సతీష్ పవార్, వైస్ ఎంపీపీ సుదర్శన్, బీఆర్ఎస్ నాయకులు మెట్టు ప్రహ్లాద్, మాసం నర్సింగ్‌రావు, జైపాల్‌రెడ్డి, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: మండలకేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో శివరాత్రి పూజలను భక్తులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం శివరాత్రి ఏకాదశిని పురస్కరించుకుని ఉపవాస దీక్షలో ఉన్న భక్తులు శనివారం ప్రత్యేక పూజలు చేసి ఉపవాస దీక్షలను విరమించారు. మండల కేంద్రంలోని భీంనగర్, రాధాకృష్ణనగర్, రాంనగర్‌తో పాటు మండలంలోని దనోరా (బి) గ్రామాల్లో మహాదేవుని పల్లకితో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి ఉపవాస దీక్షలను విరమించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

బోథ్: మండలకేంద్రంలోని శివభక్త మార్కండేయ ఆలయంలో మహాశివరాత్రి పండుగ సందర్భంగా గత మూడు రోజుల నుండి ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి శివరాత్రి పర్వదినాన వందాలాదిమంది పట్టణ ప్రజలు శివలింగాన్ని దర్శించుకున్నారు. శనివారం రోజున ఆలయంలో వేద పండితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి శివరాత్రి వేడుకలను పూర్తి చేశారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడంతో పాటు భజన బృందాలకు ప్రత్యేక సన్మానాలు చేశారు. శనివారం మధ్యాహ్నం పూజా కార్యక్రమాలు ముగించడం జరిగింది.



ఆదిలాబాద్‌లో శివలింగానికి పాలాభిషేకం చేస్తున్న భక్తులు



బాదినందీశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న



సాలెవాడలో శివపార్వతుల పల్లకీ ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



పట్టణంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



తలమడుగులో నిర్వహించిన అన్నదానంలో పాల్గొన్న భక్తులు



బోథ్ మార్కండేయ ఆలయంలో అన్నదానం నిర్వహిస్తున్న భక్తులు

రోగుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు

● ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఇంద్రవెల్లి, మార్చి 9: గ్రామీణ ప్రాంత ప్రజలకు సకాలంలో వైద్యం అందించాలనే ఉద్దేశంతో గ్రామీణ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఆసుపత్రుల్లో వైద్యులు, రోగుల పట్ల నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని పిట్టబొంగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీనిలో భాగంగా ఆసుపత్రిలో వైద్యాధికారుల హాజరు రిజిష్టర్, అలాగే రోజు వారి రోగుల ఓపీ వివరాల రికార్డులను పరిశీలించారు. ఆ తర్వాత వైద్యుడు సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని పిట్టబొంగరం గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా.. జిల్లా వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకునే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, పట్టణ అధ్యక్షులు జహీర్, తదితరులు ఉన్నారు.



పిట్టబొంగరం ప్రభుత్వ ఆసుపత్రిలో రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

'జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలి'

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 9: రిమ్స్‌లో పని చేసే కార్మికులకు కాంట్రాక్టర్ జీవో ప్రకారం వేతనాలు ఇవ్వడం లేదని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్. విలాస్ అన్నారు. జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం రిమ్స్ ఎదుట సమ్మె చేపట్టారు. అనంతరం కాంట్రాక్టర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. ఈ సందర్భంగా ఏఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ మాట్లాడుతూ రిమ్స్ కాంట్రాక్ట్ ప్రతిపాదికన పని చేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ గార్డు పేషేంట్ కేర్ సిబ్బందికి జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. వేతనాల కోసం 14 రోజులుగా నిరసనలు చేస్తున్న పట్టించుకోవడం లేదన్నారు. దాని కారణంగా విధులు బహిష్కరించి సమ్మె చేపట్టామన్నారు. జీవో ప్రకారం 15వేల 600ర ఊపాయలు ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.11 వేలు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ డబ్బులను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సిర్రదేవేందర్, రాజు, ఎక్బాల్,ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.